క్రీడల్లో రాణించి అంతర్జాతీయ ఖ్యాతి పొందాలి

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొందుర్గు, మార్చి 10: పట్టుదల, అంకితభావంతో క్రీడల్లో రాణించి అంతర్జాతీయ ఖ్యాతి పొందాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రేగడిచిల్కమర్రిలో సోమవారం క్రికెట్ టోర్నీని ఎమ్మెల్సీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తనయుడు రామకృష్ణ, నాయకులు రవీందర్‌రెడ్డి, బంధులాల్, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఖలీల్, ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, కుమార్, యాదయ్యగౌడ్, దర్గా రాంచంద్రయ్య, హరీశ్వర్‌రెడ్డి, శేఖర్, కిరణ్, వీరేందర్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్, సందీప్, శేఖర్, సత్యం, పెరుమాల్‌రెడ్డి, రాములు, కృష్ణ, నర్సింహులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మాజీ ఎంపీటీసీ మాణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు, మార్చి 10: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పద్మారం మాజీ ఎంపీటీసీ మాణయ్యను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మాణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, మెరుగైన జాగ్రత్తలు తీసుకొని త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తనయుడు రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, బాబురావు, సత్యప్రమోద్, మల్లేశ్, అంకం శేఖర్, అంకం పాండు, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమ మాధురి

ఆమనగల్లు, మార్చి 10 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కుసుమ మాధురి, సీడీపీవో శాంతి రేఖ, ప్రజ్వల సంస్థ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, ఐసీడీఎస్ ఆమనగల్లు సంయుక్తంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఉన్నత చదువులు చదవడంతో పాటు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంగన్‌వాడీ టీచర్స్ నాగమణి, సుజాత, హెల్పర్స్ మంగమ్మ, సరస్వతిని సన్మానించారు. అంతకుముందు కేజీబీవీ విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పద్మాలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రజ్వల సిబ్బంది సురేశ్ కుమార్, ఉమ, అంబర్‌సింగ్, మితాళిరాజ్, రోజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కడ్తాల్ : సావిత్రిబాయిపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

పెద్దఅంబర్‌పేట : నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

ఆదర్శమూర్తి.. సావిత్రిబాయి పూలే

- రంగారెడ్డి జిల్లాలో పూలే వర్ధంతి
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులు
- పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

షాబాద్ : బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్

కడ్తాల్, మార్చి 10: మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాఘవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నాయకులు, యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, కుమార్, మహేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

షాబాద్ : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా షాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే సమాజ అభివృద్ధికి చేసిన సేవలు నేటి తరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల ఆశోక్, నాయకులు దండు రాహుల్ గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్ రెడ్డి, ఎండీ ఖాజాపాషా, గౌరీశ్వర్, రాంరెడ్డి, అంజయ్య, కిశోర్‌నాయక్, రఫీక్, రాఘవేంద్ర స్వామి, సత్తయ్య, మహేందర్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలితరం మహిళా ఉద్యమకారిణి

పెద్దఅంబర్‌పేట : మహిళల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కేతరాజు నర్సింహ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. సావిత్రి బాయి పూలే అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్, సంఘాల నాయకులు సైదులు, వినోద్‌నాయక్, రామకృష్ణ, రమేశ్, ప్రియ, అన్నపూర్ణ, సాయిలు, నారాయణ, జ్యోతి, వీరేశ్, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

చేవెళ్లటౌన్, మార్చి 10: చేవెళ్లలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆర్డీవో చంద్రకళ సందర్శించారు. సోమవారం ఉదయం ఆమె చేవెళ్లలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, చేవెళ్ల మాడల్ జూనియర్ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆమె వెంట చేవెళ్ల డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, చీఫ్ సూపరింటెండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

ఏడు గురు గైర్హాజర్

కేశంపేట : మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షలకు సోమవారం ఏడు గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. కొత్తపేట, పాటిగడ్డ కేజీబీవీ, జేపీ దర్గా ట్రబల్ వెల్ఫేర్ కళాశాలలకు చెందిన 169 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడు గురు గైర్హాజరయ్యారని తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ శివకుమార్ పరీక్షలను పర్యవేక్షించారు. కేశంపేట పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ పరామర్శ

కేశంపేట, మార్చి 10 : మండల పరిధిలోని అల్వాల గ్రామ పంచాయతీలోని తులవానిగడ్డ అంగన్‌వాడీ కార్యకర్త లంకాల సుమతమ్మ (62) మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీలతాశ్రీనివాస్, నాయకులు సుధాకర్, రాజు, సత్తాజీ, కృష్ణ, తులవానిగడ్డ సాయిలు, శ్రీశైలం, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి జాబ్ మేళాకు తరలిరావాలి

మొయినాబాద్, మార్చి 10 : చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించే జాబ్‌మేళాకు నిరుద్యోగులు తరలిరావాలని టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఎన్ఎంసీ ఎలక్ట్రానిక్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నదని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ మేళాకు హాజరు కావాలని సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన నిరుద్యోగులు, 18 ఏండ్లు నిండిన వారు రావాలని కోరారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.15వేలు వేతనం ఇస్తారని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగయ్య, డైరెక్టర్లు రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యకారులు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిర్దుల విజ్జేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజేష్‌గౌడ్, నాయకులు విజయరాజు, నరేశ్, జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహ, రాజేంద్ర, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి.. ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందజేస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, తదితరులు

ఇబ్రహీంపట్నం, మార్చి 10 : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆయన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఊరికి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

చేవెళ్లటౌన్, మార్చి 10 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని సోమవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేల మంది బడుగు, బలహీన విద్యార్థులు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌పై అధారపడి చదువుతున్నారని తెలిపారు. ఆ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పీఏకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రీడలు పోటీతత్వాన్ని పెంచాలి

సంబురాల్లో విజేత జట్టు

పెద్దఅంబర్‌పేట, మార్చి 10 : మున్సిపాలిటీ పరిధిలోని కుత్బుల్లాపూర్ ప్రీమియర్ లీగ్ (క్యూపీఎల్) క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. పలు జట్లు పోటీ పడి ఉత్సాహంగా లీగ్‌లో పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలైన రెడ్ రేంజర్ల జట్టుకు స్పాన్సర్లు పోలోజు అరుణ్ చారి, ప్రశాంత్‌చారి, శ్రవణ్, నాయకులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ బహుమతులు అందజేశారు. క్రీడలు పోటీతత్వాన్ని పెంచాలని, మంచి వాతావరణంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఎయిమ్స్ ఒలింపియాడ్ హంట్‌కు కేశంపేట విద్యార్థులు

జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న ఎయిమ్స్ ఒలింపియాడ్ హంట్ డైరెక్టర్లు

కేశంపేట, మార్చి 10 : ఎయిమ్స్ ఒలింపియాడ్ హంట్ 2024-25కు కేశంపేట విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలోని వీఐపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆద్యకు జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు వచ్చిందని, 5వ తరగతి చదువుతున్న సాయిచరణ్‌కు జోనల్ స్థాయిలో 7వ ర్యాంకు, 6వ తరగతికి చెందిన శశాంక్‌వర్మ జోనల్ స్థాయిలో 10వ ర్యాంకు సాధించారన్నారు. ఆయా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ నవీందర్ విద్యార్థులకు మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

కడ్తాల్, మార్చి 10: ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఆదివారం రాత్రి టిప్పర్ల సాయంతో మట్టిని తరలిస్తున్నారని, అదే గ్రామానికి చెందిన వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు దాడులు నిర్వహించి నాలుగు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు టిప్పర్లు, జేసీబీ యజమానులు మునావత్ శ్రీను, నేనావత్ శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, మార్చి 10: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం చేవెళ్లలోని అర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి చేవెళ్ల మండలానికి సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిశీలించిన వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆపరేటర్ సర్దార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

మన్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 10 : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు శామ్యూల్ మాట్లాడుతూ.. ఇబ్రమీంపట్నం మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల నిధులున్నప్పటికీ వినియోగించకుండా ప్రజా సమస్యలు పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు ఎల్లేశ్, ముసిలయ్య, పురుశోత్తం, శంకర్, వీరేశ్, యాదగిరి, శివ, మహేశ్, నరేందర్, యాదగిరి, పద్మ, ఆండాలు, పార్వతమ్మ, సుజాత తదితరులు ఉన్నారు.

మండల పరిధిలోని గండిచెరువు గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులను గ్రామ ప్రత్యేక అధికారి ఇంద్రసేనారెడ్డితో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ప్రారంభించారు. - అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10

పట్టణంలోని ఎమార్సీలో సోమవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ మండల సంఘాల ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్ సన్మానించారు. - షాద్‌నగర్‌రూరల్, మార్చి 10

వర్గీకరణ చేసే వరకు ఫలితాలను ఆపాలి

కడ్తాల్ : రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్, మార్చి 10 : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి చట్టం చేసే వరకు గ్రూప్-1 ఫలితాలను ఆపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తలకొండపల్లిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు...ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో, గ్రూప్-1 ఫలితాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ మాదిగలకు తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. అంతకుముందు దీక్షలో కూర్చున వారికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నర్సింహాముదిరాజ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు శ్రీను, నాయకులు రామచంద్రయ్య, నారాయణ, కుమార్, యాదయ్య, సుధాకర్, రాజు, సంజీవ, మార్కండేయ, గణేశ్, మహేశ్, గోపాల్, శ్రీశైలం, శేఖర్, రజనీకాంత్, బాలరాజు, వంశీ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు, నియామకాలు నిలిపివేయాలి

షాద్‌నగర్‌రూరల్ : ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు,ని యామకలు తక్షణమే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ ప్రభుత్వంను డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యలయం ఎదుట ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరాహార దీక్షలో అయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి భూషన్, పాండు, శ్రవణ్, శ్రీనివాస్, జంగయ్య, సురేశ్, శీను, దసరత్, శివకుమార్, నర్సింహులు, బాలరాజు, ప్రేమ్‌రాజు, కృష్ణయ్య, పవన్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

సంకెపల్లిగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య

గ్రామాలాభివృద్ధికి నిరంతర కృషి

షాబాద్, మార్చి 10: గ్రామాలాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడలో రూ.5లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహారెడ్డి, సత్యం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు!

కేశంపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు

కేశంపేట బ్రిడ్జి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన ముళ్ల కంప

కేశంపేట, మార్చి 10 : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా జనావాసాలు, వ్యవసాయ భూముల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కేశంపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగలు నిండా చుట్టుకున్నాయి. మండల కేంద్రం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి బుధవారం జరిగే సంతలో కూరగాయల విక్రయదారులు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కిందనే కూరగాయలు పెడతారని, తీగలు బారిన ట్రాన్స్‌ఫార్మర్‌తతో ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని బ్రిడ్జివద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ముళ్ల కంప పాకడంతో రాత్రి సమయాల్లో మంటలు వస్తున్నాయని సమీపంలోని రైతులు చెబుతున్నారు. ఇటీవల మండల వ్యాప్తంగా సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ వైర్లను సరి చేసేందుకు అధికారులు నిత్యం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న అధికారులు ఇలా తీగలు, ముళ్ల కంప పాకిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎందుకు సరి చేయలేకపోతున్నారని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడు అదృశ్యం

మధు(ఫైల్)

కేశంపేట, మార్చి 10 : ఓ యువకుడు అదృశ్యమైన ఘటనలో కేశంపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ నరహరి తెలిపిన వివరాలు.. మండలంలోని పుట్టోనిగూడ గ్రామానికి చెందిన మధు (25) డబ్బుల కోసం ఇంట్లోని కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. తాను అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత అతనే వచ్చేవాడు. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు పద్మ బాల్‌రాజ్‌ను జనవరి 3న డబ్బులు అడిగాడు. లేవని చెప్పడంతో కోపోద్రిక్తుడైన మధు అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడం బంధుమిత్రులు, స్నేహితులవద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో యువకుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండిండ్లలో చోరీకి యత్నం

షాద్‌నగర్‌రూరల్, మార్చి 10 : పట్టణంలోని తిరుమల మెగా టౌన్‌షిప్‌లో రెండు ఇండ్లలో చోరీకి యత్నించిన ఘటన సోమవారం జరిగింది. వివరాలు.. కాలనీకి చెందిన దంపతులు రాజేశ్, జాన్సీరాణి ప్రభుత్వ ఉపాధ్యాయులు. విధుల నిర్వహణలో భాగంగా ఇంటికి తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. ఇంట్లో ఏమి దొరకక పోవడంతో పక్కనే తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నిస్తుండగా గమనించిన చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో దొంగ పరారయ్యాడు. ఈ విషయం ఉపాధ్యాయుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.